E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 19-02-2026 (వారం) గురువారం  సంపుటి: 02 || సంచిక:49 ||  పేజీలు–6  www.ekaburu.com



సరిహద్దుల్లో 'ఏఐ'తో చైనా కుట్రలు భగ్నం.. ఆర్మీ అధికారి » 3లో

## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్



- బాల్క సుమన్‌కు రిమాండ్
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన మంచిర్యాల కోర్టు
- సుమన్‌తో పాటు మరో ముగ్గురిని కూడా జైలుకు తరలింపు
- క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటన

ఈ కబురు ; మంచిర్యాల జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన ఘటనలకు సంబంధించి బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ....(2లో)

## బాంబు కలకలం..

- ఏకంగా 12 ఆర్డీఎక్స్‌లతో కోర్టును పేల్చేయబోతున్నామని మెయిల్




....(2లో)

# గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం

- నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ... అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన
- పట్టణాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం
- ముంబయి క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్ లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం



• ఈ కబురు ; గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు

తరువాయి 2లో



## చైనా రోబోడాగ్ వివాదం

..ఏఐ సదస్సు నుంచి ఆ యూనివర్సిటీ గెంటివేత

ఈ కబురు : భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ ఇంపాక్ట్ సదస్సును నిర్వహిస్తోంది. దానికి అంతర్జాతీయస్థాయి నేతలు, ప్రతినిధులు, టెక్ సంస్థల సీఈఓలు హాజరవుతున్నారు. ఇలాంటి సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని యూనివర్సిటీ నిర్వాకం తీవ్ర విమర్శలకు దారితీసింది.



నేటి నుంచి పవిత్ర

## రంజాన్ మాసం ప్రారంభం

- సౌదీ ఆకాశంలో నెలవంక దర్శనం..
- మత పెద్దల సూచనల మేరకు నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం ప్రకటన

ఈ కబురు ; ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ఫిబ్రవరి 18 గురువారం నుంచి ప్రారంభం కానుంది. సౌదీ అరేబియాలో నెలవంక కనిపించినట్లు మతపెద్దలు తెలిపారు.



## హిమంత బిశ్వశర్మ 'అస్సాం జిన్నా'

ఈ కబురు : అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిమంతను 'అస్సాం జిన్నా'గా ఆరోపించారు.

## వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది: కేటీఆర్

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపణ
- అధికార పార్టీకి కొందరు పోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

....(3లో)



## బాల్క సుమన్ అరెస్ట్ ను ఖండించిన హరీశ్ రావు



- కాంగ్రెస్ పార్టీ మురుగు రాజకీయాలు చేస్తోందన్న హరీశ్
- చట్టాలను తుంగలో తొక్కుతోందని విమర్శ
- చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో ఆక్రమించుకుంటున్నారని మండిపాటు

....(3లో)

## తెలంగాణలో మోగిన ఎన్నికల నగారా







- త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాలకు ఎన్నిక
- 10 రాష్ట్రాల్లో ఎన్నికలు
- 37 మంది ఎన్నిక కానున్నారు
- మొదటి విడతగా ఏప్రిల్ 2న 22 మంది పదవి విరమణ
- రెండవ విడతలో ఏప్రిల్ 9న 15 మంది పదవి విరమణ చేయనున్నారు
- మార్చి 16న పోలింగ్, 20 నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి
- కాంగ్రెస్ నుంచి ఆ ఇరువురి పేర్లు ఖరారు..?

**ఈ కబురు, హైదరాబాద్;**

తెలంగాణలో మొన్నటికి మొన్న మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరిగిన ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. ఇప్పుడిక మరో ఎన్నికలు జరుగనున్నాయి. దీనికి అవసరమైన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఏర్పాట్లనూ మొదలుపెట్టింది. తెలంగాణతో పాటు మొత్తం 10 రాష్ట్రాల్లో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 37 మంది సభ్యులు ఎన్నిక కానున్నారు. ఏప్రిల్ 9వ తేదీ నాటికి వివిధ రాష్ట్రాల నుండి మొత్తం 37 మంది సభ్యుల పదవీకాలం ముగియబోతోంది. వీరిలో తెలంగాణ నుండి డాక్టర్ అభిషేక్ మను సింఘ్వి, కేఆర్ సురేష్ రెడ్డి ఉన్నారు.

తరువాయి 2లో

## భారత్ సాయం మాకు అత్యంత కీలకం

..ఐరాస చీఫ్ గుటెరెస్ స్పష్టీకరణ



ఈ కబురు : అంతర్జాతీయ సమాజ అభ్యున్నతి కోసం శాశ్వత ప్రాతిపదికన భారత్ అందిస్తున్న సాయం తమకెంతో కీలకమని ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ స్పష్టం చేశారు. ప్రపంచంలో ఇప్పుడు భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలక పాత్రను పోషించే అత్యంత సానుకూల ధోరణి నడుస్తోందని తెలిపారు. దక్షిణార్ధ గోళ దేశాల పరిధిలో తొలిసారిగా భారత్ నిర్వహిస్తున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో పాల్గొనేందుకు అమెరికాలోని న్యూయార్క్ నుంచి బయలుదేరే ముందు ఆయన పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఐరాస నిర్వహిస్తున్న పీస్ కీపింగ్ మిషన్లలో అత్యధికంగా 5వేల మంది భారత భద్రతా సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఇందుకోసం భారత్‌కు ఐరాస సదా రుణపడి ఉంటుందని చెప్పారు. 2007లో లైబీరియాలో పీస్ కీపింగ్ మిషన్ కోసం పూర్తిగా మహిళలతో కూడిన తొలి పోలీస్ యూనిట్‌ను అందించిన ఘనత భారత్‌కే దక్కుతుందని తెలిపారు. జీ20 సదస్సును భారత్ నిర్వహించిన సమయంలోనే పలు విప్లవాత్మక నిర్ణయాలను తీసుకున్నారని గుర్తు చేశారు.

తరువాయి 2లో

## దుస్తులను లాగడమూ అత్యాచార యత్నమే ..సుప్రీంకోర్టు

**ఈ కబురు, ఢిల్లీ:**


మహిళ దుస్తులను పట్టుకొని లాగటం, వక్షోజాలను తాకడం అత్యాచారం కిందకు రాదంటూ అలహాబాద్ హైకోర్టు జడ్జి ఇచ్చిన తీర్పు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరిపింది. ....(2లో)




## బంధుప్రీతి ప్రజాస్వామ్య వ్యవస్థకు శాపం ..సుప్రీంకోర్టు

ఈ కబురు : బంధుప్రీతి అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓ శాపమని సుప్రీం కోర్టు పేర్కొంది. హౌసింగ్ సొసైటీ ఫ్లాట్‌ల కేటాయింపులో అధికార దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ విధంగా వ్యాఖ్యానించింది. ....(2లో)

## విడాకులు ఇచ్చిందన్న కోపంతో.. మాజీ భార్యను హత్య చేసి..



....(2లో)



## విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

....(3లో)

## అందుకే కొన్నిచోట్ల హిందీపై వ్యతిరేకత..!: కేరళ గవర్నర్

ఈ కబురు : దేశంలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా దక్షిణాదిలో హిందీపై వ్యతిరేకత అనేది.. ....(3లో)



## జాతీయ భద్రతకు రాహుల్ గాంధీ ప్రమాదకరం



ఈ కబురు : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్‌కు భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయని అన్నారు. విదేశీ పర్యటనల సమయంలో వేర్పాటువాదులు, మావోయిస్టులు, అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు జార్జిసోరస్ వంటి వ్యక్తులతో సమావేశమవుతున్నారని ఆరోపించారు. ....(2లో)

# గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం





. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి IIT, IIM, IISC వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ (LPG) సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (GCCs) మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు.

కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను CURE, PURE, RARE జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE)గా ప్రకటించగా, ORR, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ (RRR) మధ్య ప్రాంతాన్ని PURE జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి "చైనా +1" ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు.

తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ఠ డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8% లేదా దాదాపు 25% గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు. అదేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.. ORR, RRR మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి , వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ CURE ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా EVల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోనే EV తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా (HYDRAA) రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## దుస్తులను లాగడమూ అత్యాచార యత్నమే ..సుప్రీంకోర్టు



--అసలేం జరిగిందంటే..?

2021 నవంబరులో ఉత్తర్‌ప్రదేశ్ లోని కస్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన 11 ఏళ్ల (ఘటన జరిగే నాటికి) కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వారిని సమీపించి బాలికను ఇంటి దగ్గర దింపుతామని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. మార్గ మధ్యంలో అమ్మాయిని అసభ్యంగా తాకుతూ కల్వర్టు కిందకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్న వారు రావడంతో నిందితులు అక్కడినుంచి పరారయ్యారు. ఈ కేసుపై గతేడాది అలహాబాద్ హైకోర్టు జడ్జి ఇచ్చిన తీర్పు వివాదాస్పదమైంది. మహిళ వక్షోజాలను తాకడం, దుస్తులు పట్టుకొని లాగినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ కేసును కొట్టివేశారు. ఇలాంటి తీర్పుతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని అభ్యర్థనలు వచ్చాయి. ఆ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు తీసుకుంది. హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు ఏమాత్రం సున్నితమైనవి కావని, అమానవీయంగా ఉన్నాయని గత విచారణలో విచారం వ్యక్తంచేసింది. ఆ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. ఈ నేపథ్యంలోనే తాజా తీర్పు వెలువడింది. నిందితుల చర్యలు అత్యాచారం కిందకే వస్తాయని స్పష్టం చేసిన అత్యున్నత న్యాయస్థానం.. హైకోర్టు వ్యాఖ్యలతో ఏకీభవించలేమని పేర్కొంది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసింది.

## బంధుప్రీతి ప్రజాస్వామ్య వ్యవస్థకు శాపం ..సుప్రీంకోర్టు



వీటికి సంబంధించి పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పక్కనబెట్టిన న్యాయస్థానం.. ఆ కేటాయింపులను రద్దు చేసింది. హరియాణా అర్బన్ హౌసింగ్ సొసైటీలో రెండు లగ్జరీ ఫ్లాట్‌ల కేటాయింపులో అధికార దుర్వినియోగం జరిగిందంటూ స్థానిక ప్రభుత్వ ఉద్యోగి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. "బంధుప్రీతి, పక్షపాతం అనేవి ప్రజాస్వామ్య వ్యవస్థకు శాపం లాంటివి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల్లో ఈ వైఖరి అసహ్యకరంగా ఉంటుంది" అని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేటాయింపులకు సంబంధించి గతంలో పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. పాలకమండలి సభ్యుడికి, అతడి కిందిస్థాయి అధికారికి చేసిన కేటాయింపులు పక్షపాతంగా, ఏకపక్షంగా ఉన్నాయని నిర్ధరించిన న్యాయస్థానం.. సొసైటీ నిబంధనలను ఉల్లంఘించారని స్పష్టం చేసింది.

## బాంబు కలకలం..

ఈ కబురు, హైదరాబాద్;

నాంపల్లి క్రిమినల్ కోర్టులో బుధవారం ఒక్కసారిగా బాంబు కలకలం రేగింది. కోర్టు భవనంలో బాంబులు పెట్టామని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఏకంగా 12 ఆర్డీఎక్స్‌లతో కోర్టును పేల్చేయబోతున్నామని మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో కోర్టులోని న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఈ బెదిరింపు నేపథ్యంలో పోలీసులు, భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. కోర్టు భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి తనిఖీలు చేపట్టారు. కోర్టు భవనం మూలమూలలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే ఇది కేవలం ఆకతాయిల పనేనని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసేందుకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## జాతీయ భద్రతకు రాహుల్ గాంధీ ప్రమాదకరం: రిజిజు

దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపే ఆయన జాతీయ భద్రతకు చాలా ప్రమాదకరమన్నారు. ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాని కి సిద్ధమవడంపై రిజిజు మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రాహుల్ గాంధీ వారి వ్యాఖ్యలతో చర్చలకు తరచూ అంతరాయం కలిగిస్తారన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ ఆయన లాంటి ప్రతిపక్ష నేతను చూడలేదన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరగనీయకూడదనే ఉద్దేశంతో కాగితాలు విసిరేయడం, నినాదాలు చేస్తూ వాకౌట్ చేయడం వంటి చిన్న పిల్లల చర్యలు చేస్తుంటారని అసహనం వ్యక్తంచేశారు. రాహుల్ ఈ విధంగా ప్రతిసారీ సభకు అంతరాయం కలిగించడం వల్ల ప్రజల సమస్యల గురించి మాట్లాడాలనుకున్న ఇతర చిన్న పార్టీల నేతలకు అవకాశం ఉండట్లేదన్నారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని.. జాతీయ ప్రయోజనాలతో రాజీ పడుతోందని ఇటీవల లోక్‌సభలో రాహుల్ ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే రాహుల్ వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని భాజపా పార్లమెంటు సభ్యుడు నిషికాంత్ దూబే ఆరోపిస్తూ.. ఫిబ్రవరి 12న లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇందుకుగాను రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని.. ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరారు. ఈ నేపథ్యంలో రాహుల్‌పై కిరణ్ రిజిజు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## చైనా రోబోడాగ్ వివాదం ..ఏఐ సదస్సు నుంచి ఆ యూనివర్సిటీ గెంటివేత

చైనా రోబోడాగ్ వివాదాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది . జాతీయ మీడియా కథనాల ప్రకారం.. గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ దిల్లీలో జరుగుతోన్న ఏఐ సదస్సులో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది . విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రోబోడాగ్‌ను అభివృద్ధి చేశామంటూ విద్యాసంస్థ ప్రతినిధులు దానిని ప్రదర్శించారు. దానికి 'Orion' అని పేరుపెట్టి దాని పనితీరును మీడియాకు వివరించారు. ఆ వీడియోలు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. అలాంటి రోబోడాగ్‌నే చైనా రోబోటిక్ కంపెనీ యూనిట్రీ అభివృద్ధి చేసింది. యూనిట్రీ Go2 పేరిట విక్రయిస్తోంది. భారత్‌లోనూ ఆ విక్రయాలకు అనుమతి ఉంది. రూ.2లక్షలు నుంచి రూ.3లక్షలు పెట్టి ఆన్‌లైన్‌లో ఆ డాగ్‌ను కొనుక్కోవచ్చు. ఈ విషయాన్ని గుర్తించిన నెటిజన్లు యూనివర్సిటీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విదేశీ సాంకేతికతను భారత్ ఆవిష్కరణగా ప్రచారం చేసుకోవడంపై విమర్శలు చేశారు. దీనిపై యూనివర్సిటీ వివరణ ఇచ్చుకుంది. దానిని చైనా సంస్థ నుంచే కొనుగోలు చేశామని, విద్యార్థులు నేర్చుకోవడానికి ఒక సాధనంగా వాడుతున్నామని చెప్పింది. దానిని తామే అభివృద్ధి చేశామని ఎన్నడూ చెప్పలేదని పేర్కొంది. భారత్‌లో అలాంటి ఉత్పత్తిని తీసుకొచ్చేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని చెప్పింది. కానీ నెట్టింట్లో చక్కర్లు కొడుతోన్న వీడియోల్లో విద్యాసంస్థ ప్రతినిధులు దానిని తామే అభివృద్ధి చేసినట్లు చెప్పుకోవడం గమనార్హం. ఈ వ్యవహారాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. సదస్సులో నుంచి గల్గోటియాస్‌కు ఉద్వాసన పలికింది. దానికి కేటాయించిన స్టాల్‌ను అధికారులు ఖాళీ చేయించారు. అయితే రోబోడాగ్ వరకే ఈ వివాదం పరిమితం కాలేదు. దక్షిణకొరియా అభివృద్ధి చేసిన సాకర్ డ్రోన్‌ను తమవద్దే అభివృద్ధి చేశామని విద్యాసంస్థ ప్రతినిధులు చెప్పినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యాఖ్యలు కూడా తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. సాకర్ డ్రోన్ రిమోట్ కంట్రోల్‌తో నడుస్తుంది. డ్రోన్ చుట్టూ గుండ్రటి ఆకృతి పంజరం మాదిరిగా ఉంటుంది. కాగా.. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. సరైన ప్లానింగ్ లేకుండా ప్రచారం చేసుకుంటున్నారంటూ కేంద్రాన్ని ఉద్దేశించి విమర్శలు చేశారు.

## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

ఆయనతో పాటు మరో ముగ్గురికి కూడా కోర్టు రిమాండ్ ఆదేశాలు జారీ చేసింది. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై దాడి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో మంగళవారం రాత్రి ఆయనపై కేసు నమోదైంది. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చారు. వివరాల్లోకి వెళితే, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ కాన్వాయ్‌ను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మంత్రి కాన్వాయ్‌పై రాళ్లదాడి జరిగింది. ఈ ఘటనలో మంత్రి ప్రయాణిస్తున్న కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడికి బాల్క సుమన్ నాయకత్వం వహించారని, పోలీసుల బారికేడ్లను స్వయంగా ఆయనే మంత్రి కాన్వాయ్‌పైకి విసిరారని ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజీలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై మంత్రి వివేక్ తీవ్రంగా స్పందించారు. బాల్క సుమన్ గూండాలతో తనపై హత్యాయత్నం చేయించారని ఆరోపిస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, దాడికి పాల్పడ్డారని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఫిర్యాదు మేరకు బాల్క సుమన్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగానే ఆయన్ను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ ఘటనతో మంచిర్యాల జిల్లాలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. గొడవల కారణంగా క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.

## విడాకులు ఇచ్చిందన్న కోపంతో.. మాజీ భార్యను హత్య చేసి..

ఈ కబురు, హైదరాబాద్: వనస్థలిపురంలో దారుణం చోటుచేసుకుంది. విడాకులు ఇచ్చిందన్న కోపంతో మాజీ భార్యను ఓ వ్యక్తి హత్య చేశాడు. వనస్థలిపురంలోని గ్రీన్‌సిటీ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న సునీతకు గతంలో మహేశ్‌తో వివాహమైంది. ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో సునీత ఏడాది క్రితమే అతడికి విడాకులు ఇచ్చి రెండో వివాహం చేసుకుంది. దీంతో కోపం పెంచుకున్న మహేశ్.. ఆమె ఇంట్లోకి కత్తులు, పెట్రోల్ డబ్బాతో చొరబడి దారుణంగా హత్య చేశాడు. అనంతరం పారిపోతున్న అతడిని అపార్ట్‌మెంట్ వాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి.. దర్యాప్తు చేపట్టారు. సునీత తనను మోసం చేసి రెండో వివాహం చేసుకుందన్న కారణంతో హత్య చేసినట్లు నిందితుడు మహేశ్ తెలిపినట్లు పోలీసులు చెప్పారు.

## భారత్ సాయం మాకు అత్యంత కీలకం ..ఐరాస చీఫ్ గుటెరెస్ స్పష్టీకరణ

**–ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత్ చేయూత**

**'ఒక బాధ్యతాయుత ప్రజాస్వామిక దేశంగా, ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత్ చేయూత అందిస్తోంది. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మెజారిటీ వాటాను కలిగి ఉన్నాయి. ప్రత్యేకించి అంతర్జాతీయ మార్కెట్‌లో అత్యధిక వాటాను భారత ఆర్థిక వ్యవస్థే కలిగి ఉంది' అని గుటెరెస్ వ్యాఖ్యానించారు.**



**––భద్రతా మండలి వైఫల్యంవల్లే ఐరాసపై విమర్శలు**

'ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు సంక్షోభాలు, అన్యాయాలు, అసమానతలు, పేదరికం, ఆకలి పెరుగుతున్నాయి. చాలా దేశాల్లో ఉగ్రవాద భూతం వేళ్లూనుకుంటోంది. ఈ నేపథ్యంలో యావత్ ప్రపంచం ఐక్యరాజ్య సమితివైపు చూస్తోంది. అయితే ఐరాస అంటే కేవలం భద్రతా మండలి ఒక్కటే కాదు. 193 దేశాలకు ప్రాతినిధ్యం ఉంది. వీటికి సమానమైన ప్రాధాన్యం ఉంటుంది. కానీ.. భద్రతా మండలి కొన్ని దేశాలకే పరిమితం అయినందువల్లే ప్రపంచ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో అది సరైన నిర్ణయాలను తీసుకోలేకపోతోంది. కేవలం భద్రతా మండలి వైఫల్యం కారణంగానే ఐరాస విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తోంది' అని ఆంటోనియో వ్యాఖ్యానించారు.

**––భారత రాష్ట్రపతి, ప్రధానితో భేటీ**

దిల్లీ వేదికగా జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' వస్తున్న గుటెరెస్.. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీలతో భేటీ కానున్నారు. సదస్సులో పాల్గొనే అంతర్జాతీయ టెక్ కంపెనీల ప్రముఖులతోనూ ఆయన సమావేశమవుతారు. ఐరాస ఏర్పాటు చేసిన 'ఇంటర్నేషనల్ సైంటిఫిక్ ప్యానల్ ఆన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' సభ్యులతో దిల్లీలో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ ఐరాస విభాగంలో ఉన్న 40 మంది టెక్ నిపుణుల్లో ఐఐటీ మద్రాస్‌కు చెందిన బాలరామన్ రవీంద్రన్‌కు చోటు లభించింది.

## తెలంగాణలో మోగిన ఎన్నికల నగారా

మను సింఘ్వీ కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. సురేష్ రెడ్డిని బీఆర్ఎస్ నామినేట్ చేసింది. ఈ నెల 26వ తేదీ గురువారం నాడు నోటిఫికేషన్ విడుదల అవుతుంది. నామినేషన్లను దాఖలు చేయడానికి చివరి తేదీ మార్చి 5. ఆ మరుసటి రోజే నామినేషన్ల స్క్రూటినీ ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు మార్చి 9వ తేదీ వరకు గడువు ఉంటుంది. 16వ తేదీన పోలింగ్. ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుండి ఓట్లను లెక్కిస్తారు. 20 నాటికి ఈ ప్రక్రియ మొత్తం పూర్తవుతుంది. మొదటి విడతగా ఏప్రిల్ 2న మొత్తం 22 మంది సభ్యులు పదవీ విరమణ చేస్తారు. మహారాష్ట్ర నుండి డాక్టర్ భగవత్ కిషన్‌రావ్ కరద్, డాక్టర్ ఫౌజియా తహసీన్ అహ్మద్ ఖాన్, ప్రియాంక విక్రమ్ చతుర్వేది, శరద్‌చంద్ర గోవిందరావు పవార్, ధైర్యశీల్ మోహన్ పాటిల్, రజనీ అశోకరావు పాటిల్, రాందాస్ బందు అథవాలే, ఒడిశా నుండి మమతా మొహంతా, ముజిబుల్లా ఖాన్, సుజీత్ కుమార్, నిరంజన్ బిషి పదవీకాలం ముగుస్తుంది.తమిళనాడు నుండి ఎన్ఆర్ ఇళాంగో, పీ సెల్వరాసు, ఎం తంబిదురై, తిరుచ్చి శివ, డాక్టర్ కనిమొళి, ఎన్‌వీఎన్ సోము, జీకే వాసన్ పదవీ విరమణ చేస్తారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రితబ్రత బెనర్జీ, సాకేత్ గోఖలే, బికాష్ రంజన్ భట్టాచార్య, సుబ్రతా బక్షి పదవీకాలం ముగుస్తుండగా, మౌసమ్ నూర్ స్థానం ఈ ఏడాది జనవరి 5 నుండే ఖాళీగా ఉంది.

రెండవ విడతలో ఏప్రిల్ 9న మొత్తం 15 మంది సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. అస్సాం నుండి రామేశ్వర్ తేలి, భువనేశ్వర్ కలిత, అజిత్ కుమార్ భూయాన్ పదవీ విరమణ చేస్తారు. బీహార్ నుండి అమరేంద్ర ధారీ సింగ్, ప్రేమ్ చంద్ గుప్తా, రామ్‌నాథ్ ఠాకూర్, ఉపేంద్ర కుష్వాహా, హరివంశ్ నారాయణ్ సింగ్ పదవీకాలం ముగియనుంది. ఛత్తీస్‌గఢ్ నుండి కవి తేజ్‌పాల్ సింగ్ తులసి, ఫూలో దేవి నేథామ్; హర్యానా నుండి కిరణ్ చౌదరి, రామ్ చందర్ జాంగ్రా, హిమాచల్ ప్రదేశ్ నుండి ఇందు బాలా గోస్వామి పదవీ విరమణ చేస్తారు.

**తెలంగాణ నుంచి రాజ్యసభకు ఆ ఇద్దరు ఫిక్స్... కాంగ్రెస్ అనూహ్య ఎంపిక..!!**

రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో ,అభ్యర్థుల ఖరారు పైన కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయానికి వచ్చింది. తెలంగాణ నుంచి ఇద్దరు సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో పార్టీ ఇద్దరు అభ్యర్థులను దాదాపు ఖరారు చేసింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ తో చర్చల తరువాత ఈ నిర్ణయం తీసుకుందని సమాచారం. అయితే, బీఆర్ఎస్ పోటీకి దిగకుంటే కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరు ఏకగ్రీవంగా పెద్దల సభకు వెళ్లటం ఖాయంగా కనిపిస్తోంది.రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల అయింది. తెలంగాణ సహా 10 రాష్ట్రాల్లో 37 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో తెలంగాణ నుంచి రెండు స్థానాలకు ఎన్నికలు జరగను న్నాయి. ప్రస్తుతం తెలంగాణ నుంచి పెద్దల సభలో సభ్యులుగా ఉన్న బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ పదవీ కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. వీరి స్థానంలో తెలంగాణ నుంచి ఇద్దరు సభ్యులు ఎంపిక కావాల్సి ఉంది. అసెంబ్లీలో ఉన్న సంఖ్యాబలంతో కాంగ్రెస్ రెండు స్థానాలు దక్కించుకోవటం సులభంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో రెండు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసింది. ఢిల్లీ వర్గాల సమాచారం మేరకు ప్రస్తుత సభ్యులు అభిషేక్ సింఘ్వీ కి తిరిగి రెన్యువల్ కానుంది. సింఘ్వీ ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం న్యాయ వ్యవహారాల్లో కీలకం గా మారారు. అదే సమయంలో కాంగ్రెస్ అధినాయకత్వానికి సన్నిహిత నేత కావటంతో ఆయనకు తిరిగి అవకాశం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, రెండో స్థానం కోసం సుప్రీం మాజీ న్యాయమూర్తి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఇండియా కూటమి నుంచి పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరు ఖరారు చేసినట్లు సమాచారం. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటమి తరువాత ఆయన్ను రాజ్యసభకు పంపాలని గతంలో కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ తమ అభ్యర్థులను పోటీకి దింపకుంటే, ఈ ఇద్దరి ఎన్నిక లాంఛనంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ పోటీకి దిగితే మార్చి 16న పోలింగ్, అదే రోజు సాయంత్రం 5గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుంది. అయితే సుదర్శన్ రెడ్డి ని బరిలోకి దింపితే పోటీ ఉండే అవకాశం లేదని చెబుతున్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి దేశంలోనే అత్యంత లబ్ధ ప్రతిష్టులైన ప్రగతిశీల న్యాయకోవిదునిగా కాంగ్రెస్ నాయకత్వం గతంలోనే అభివర్ణించింది. సుదర్శన్ రెడ్డికి సుదీర్ఘ, గొప్ప న్యాయపరమైన అనుభవం ఉందని, ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా, గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారని ఉప రాష్ట్రపతి ఎన్నిక సమయంలోనే ఖర్గే వివరించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం నిబద్ధతతో, ధైర్యంతో పోరాడుతున్నారని తెలిపారు. దీంతో ఇప్పుడు సుదర్శన్ రెడ్డిని పెద్దల సభకు పంపాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. చివరి నిమిషంలో మార్పులు లేకుంటే సుదర్శన్ రెడ్డి, సింఘ్వీ తెలంగాణ నుంచి పెద్దల సభకు వెళ్లటం ఖాయంగా కనిపిస్తోంది.

# సరిహద్దుల్లో ‘ఏఐ’తో చైనా కుట్రలు భగ్నం.. ఆర్మీ అధికారి



ఈ కబురు : దేశ రక్షణరంగంలో కృత్రిమ మేధ కీలకంగా మారుతోందని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ దినేశ్ సింగ్ రాణా తెలిపారు. ఏఐ సాయంతో మన సైన్యం చైనా కదలికలను ముందే గుర్తించగలిగిందని వెల్లడించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి ఆ దేశ దళాల దాడి యత్నాలను పసిగట్టి వాటిని భగ్నం చేయడంలో ఏఐ సమర్థంగా పనిచేసిందని పేర్కొన్నారు. దిల్లీలో జరుగుతోన్న ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్’లో లెఫ్టినెంట్ జనరల్ రాణా ఈ కీలక విషయాలను వెల్లడించారు. ‘‘ఆధునిక యుద్ధ పరిస్థితులు, వ్యూహాత్మక సిద్ధాంతాలు, జాతీయ భద్రతా ప్రణాళికలను కృత్రిమ మేధ మార్చేస్తోంది. స్వదేశీ పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో రూపొందించిన మన ఏఐ వ్యవస్థ సాయంతో ఇటీవల వివాదాస్పద సెక్టార్‌లో చైనా మోహరింపులను భారత సైన్యం ముందుగానే పసిగట్టగలిగింది. శత్రువుల కదలికలను, వ్యూహాలను మన బలగాలు ముందుగానే అంచనా వేశాయి. అలా ఏఐఆధారిత నిఘా సమాచారంతో భారత్ వైపు దళాల మోహరింపు చేపట్టాం. అత్యవసర పరిస్థితుల్లో తరలింపు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాం. ఫలితంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా.. చైనా ప్రయత్నాలను భగ్నం చేయగలిగాం’’ అని లెఫ్టినెంట్ జనరల్ దినేశ్ రాణా వివరించారు. అయితే, ఇది ఎప్పుడు జరిగిందన్న వివరాలను ఆయన వెల్లడించలేదు. కృత్రిమ మేధ ఇప్పుడు ప్రపంచశక్తికి కేంద్రంగా మారిందని రాణా అన్నారు. కేవలం సాఫ్ట్‌వేర్ రంగానికి మాత్రమే ఇది పరిమితం కాలేదని, మౌలిక సదుపాయాలు, సైనిక వ్యవస్థలు, కమాండ్ కంట్రోల్ సిస్టమ్స్ వంటి వాటిలోనూ ఏఐ మెరుగ్గా పనిచేస్తోందని తెలిపారు. ఇక, రక్షణరంగంలోనూ స్వదేశీ ఆయుధాల తయారీ, శత్రువుల లక్ష్యాలను గుర్తించడం, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, సైబర్ డిఫెన్స్ వంటి వాటిల్లోనూ కృత్రిమ మేధ వినియోగం పెరుగుతోందన్నారు. అయితే, ఏఐతో ప్రయోజనాలతో పాటు ప్రమాదాలు లేకపోలేదని లెఫ్టినెంట్ జనరల్ గుర్తుచేశారు. చెడ్డ వ్యక్తుల చేతుల్లో ఈ సాంకేతికత దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందన్నారు. మన దేశం బాధ్యతాయుతమైన అణ్వాయుధ శక్తి అని.. అలాగే ఐఏతో మరింత సూపర్ పవర్ కావాలని కోరుకుంటున్నట్లు రానా వెల్లడించారు.

# వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది: కేటీఆర్



తాను సాధించిన మెడల్స్ తో డాక్టర్ కొలన్ జగజ్జీవన్ రెడ్డి

ఈ కబురు ; బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

# మంత బిశ్వశర్మ ‘అస్సాం జిన్నా’ ..గౌరవ్ గొగొయ్



. భాజపాలో చేరేవారంతా వారి రాజకీయ జీవితంలో ప్రాధాన్యం లేనివారిగా మిగిలిపోతారంటూ విమర్శలు చేశారు. గువాహటిలో గొగొయ్ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర మాజీ కాంగ్రెస్ చీఫ్ భూపెన్ కుమార్ బోరా రాజీనామా పత్రంపై తీవ్ర చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన భాజపాలో చేరనున్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై గొగొయ్ మాట్లాడుతూ.. కమలంలో చేరితే బోరా కూడా ప్రాధాన్యం లేని రాజకీయ నాయకుడిగా మిగిలిపోతారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిజమైన పోరాటం కాంగ్రెస్.. పాత కాంగ్రెస్ (పార్టీని వీడిన వారి) మధ్య ఉంటుందని వ్యాఖ్యానించారు. భాజపాలో అనేక మంది మాజీ కాంగ్రెస్ నాయకులు ఉన్నారని.. వారంతా రాష్ట్రంలో అవినీతిపరులని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం హిమంత బిశ్వ శర్మ పై తీవ్ర విమర్శలు చేశారు. బోరా కాంగ్రెస్‌ను వీడటం వల్ల.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీపై ఎలాంటి ప్రభావం ఉండదని వ్యాఖ్యానించారు.

# అందుకే కొన్నిచోట్ల హిందీపై వ్యతిరేకత.. కేరళ గవర్నర్



. ఆ భాషలో ఉర్దూ, పర్షియన్ పదాలు ఉండటం వల్లే కావొచ్చని కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అన్నారు. సంస్కృతం ఆధారిత పదజాలాన్ని వినియోగించడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపొచ్చని తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. ‘‘భాషపైన వ్యతిరేకత కంటే అందులోని పదజాలానికి సంబంధించిన అడ్డంకులే హిందీ మాట్లాడకపోవడానికి ఎక్కువగా కారణమవుతున్నాయి. ప్రస్తుతం హిందీలో ఉపయోగిస్తున్న అనేక పదాలు ఉర్దూ, పర్షియన్ నుంచి తీసుకున్నవే. దీంతో దక్షిణాది భాషలు మాట్లాడేవారికి హిందీ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయేమో! హిందీలో మాట్లాడేటప్పుడు సంస్కృతం నుంచి పుట్టిన పదాలను ఎక్కువగా వాడితే.. దక్షిణాదిలోని చాలామంది అర్థం చేసుకోగలరు’’ అని గవర్నర్ అర్లేకర్ అన్నారు. ‘‘సంస్కృతంతో ముడిపడి అనేక భారతీయ భాషల మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయి. అవి భాషాపరమైన అంతరాలను తగ్గించేందుకు దోహదపడతాయి. భాషల మధ్య వ్యత్యాసాలను ఎత్తిచూపే బదులు వాటి మధ్య సంబంధాలను గుర్తించడం, పరస్పర అవగాహనను పెంపొందించడంపై భాషాపండితులు, పరిశోధకులు దృష్టి సారించాలి. సమ్మిళిత, ఐకమత్య దేశాన్ని నిర్మించేందుకు ఒకరి భాషను మరొకరు అర్థం చేసుకోవడం చాలా అవసరం’’ అని తెలిపారు.

# బాల్క సుమన్ అరెస్ట్ ను ఖండించిన హరీశ్ రావు



ఈ కబురు ; తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మురుగు రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... క్యాతనపల్లిలో బీఆర్ఎస్‌కి పూర్తి మెజారిటీ వచ్చినా కాంగ్రెస్ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరును యావత్ తెలంగాణ అసహ్యించుకుంటోందని అన్నారు. అధికార బలం, ధన బలంతో చట్టాలను కాంగ్రెస్ తుంగలో తొక్కుతోందని విమర్శించారు. పోలీసులు కూడా అధికార పార్టీకి పూర్తిగా సహకరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక చర్యలను అడ్డుకున్నందుకు దళిత నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని హరీశ్ రావు పేర్కొన్నారు. “జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్ కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదు’’ అని ఆయన మండిపడ్డారు. క్యాతనపల్లి, తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును కాంగ్రెస్ గౌరవించలేదని దుయ్యబట్టారు. చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని ఆరోపించారు. భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా చేస్తున్నారని విమర్శించారు.

# ఏఐ.. ఆటోమేషన్‌తో వైద్య రంగంలో పెనుమార్పులు

ఈ కబురు, హైదరాబాద్: ‘ప్రపంచ ఆరోగ్య ముఖచిత్రం వేగంగా మారిపోతోంది. నిన్నటి వరకూ అసాధ్యమనుకున్న చికిత్సలు నేడు ‘టెక్‌బయో’ విప్లవంతో సుసాధ్యమవుతున్నాయి. ఔషధ రంగంలో పరిశోధన, ఉత్పత్తి మధ్య దశాబ్దాలుగా ఉన్న అవరోధాలను అధిగమించి, రోగికి అత్యంత వేగంగా, తక్కువ ధరకు వైద్యం అందించడమే లక్ష్యంగా అడుగులు పడాలి’ నిపుణులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ‘బయో ఆసియా 2026’లో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్యానల్ చర్చలో పలు విదేశీ సంస్థల ప్రతినిధులు, నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. భారత్‌ను కేవలం తక్కువ ధరకు ఔషధాలు తయారు చేసే కేంద్రంగా చూడకూడదు. ఈ దేశం ఒక ‘ఇంటిగ్రేటెడ్ ఇన్నోవేషన్ హబ్’. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ‘నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ’ ద్వారా రాబోయే ఐదేళ్లలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకోవడం అభినందనీయం అన్నారు. కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో భారత్ చూపిన వేగం.. భవిష్యత్తులో క్యాన్సర్, అల్జీమర్స్ వంటి వ్యాధుల నివారణలోనూ ప్రతిబింబించాలి. రోబోటిక్ సర్జరీలు, ఇమేజింగ్ డేటా ద్వారా వైద్యం మరింత కచ్చితత్వంతో సాగుతుంది. డేటాను కేవలం గణాంకాలుగా చూడకుండా, రోగి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడానికి వినియోగించాలి. సైన్స్ దిశను చూపిస్తే.. సాఫ్ట్‌వేర్ వేగాన్ని.. సప్లయ్ చైన్ ప్రాణాన్ని ఇస్తుంది. ఈ మూడింటి కలయికే 2026 నాటి ఆరోగ్య విప్లవం. అంతిమంగా సామాన్యుడికి అందుబాటు ధరలో వైద్యం అందినప్పుడే ఈ ఆవిష్కరణలకు సార్థకత లభిస్తుందన్నారు.

# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ







ఈ కబురు, విశాఖపట్నం:
విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) జరిగింది. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొని ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి

# చర్చలు సాగిస్తూనే.. పశ్చిమాసియాకు అమెరికా యుద్ధ విమానాలు



ఈ కబురు : అమెరికా ఇరాన్ ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అణుఒప్పందానికి సంబంధించి ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్న క్రమంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. 24 గంటల్లో దాదాపు 50 అత్యాధునిక ఫైటర్ జెట్ల ను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. దీంతో అగ్రరాజ్యం ఏ క్షణాన ఎలాంటి చర్యలకు దిగుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. చర్చలు విఫలమైతే సైనిక చర్యకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటి నుంచి ఇరాన్‌ను హెచ్చరిస్తున్నారు. జెనీవా వేదికగా ఇరుదేశాల మధ్య జరిగిన రెండో రౌండ్ చర్చలు కూడా ముగిశాయి. ఈ క్రమంలో యూఎస్ తన ఫైటర్‌జెట్లను పశ్చిమాసియా కు పంపడం గమనార్హం. ఈ తాజా చర్యలను అమెరికా అధికారిణి ఒకరు ధ్రువీకరించినట్లు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. యూఎస్‌కు చెందిన ఎఫ్22, ఎఫ్16, ఎఫ్35 వంటి ఫైటర్ జెట్‌లతో పాటు గగనతలంలోనే ఫ్యూయల్ నింపుకొనే యుద్ధ విమానాలు మధ్యప్రాచ్యం వైపునకు వెళ్తున్నట్లు కొన్ని ఫ్లైట్ ట్రాకింగ్‌లు కూడా నివేదించాయి. ఇదిలాఉండగా.. అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ కరేబియన్ సముద్రం నుంచి పశ్చిమాసియా దిశగా వెళ్లోందని ఓ నేవీ అధికారి తెలిపారు. యుఎస్ఎస్ మహాన్, యూఎస్ఎస్ బెయిన్‌బ్రిడ్జ్, యూఎస్ఎస్ విన్స్టన్ చర్చిల్ వంటి మూడు గైడెడ్ క్షిపణి డిస్ట్రాయర్‌లు దీన్ని అనుసరిస్తోన్నట్టు సమాచారం. అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌తో పాటు పలు యుద్ధ విమానాలను ఇప్పటికే ఈ ప్రాంతంలో మోహరించిన సంగతి తెలిసిందే.

--ఇరాన్ వాటిని ఇంకా అంగీకరించలేదు: రూబియో
జెనీవాలో చర్చలు చాలా సానుకూలంగా జరిగాయని అమెరికా, ఇరాన్‌లు పేర్కొన్నాయి. చర్చల్లో పురోగతి సాధించామని.. కొన్ని విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని యూఎస్ అధికారులు తెలిపారు. ఓ ఒప్పందం కుదుర్చుకునేందుకు మార్గం సుగుమమైందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ వెల్లడించారు. కాగా.. తాజా చర్చలు మిశ్రమ ఫలితాలు ఇచ్చాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. ఇరానియన్లు అంగీకరించడానికి సిద్ధంగా లేని కొన్ని కఠినమైన షరతులను ట్రంప్ నిర్దేశించినట్లు తెలిపారు. యూఎస్ ఇంకా దౌత్యపరమైన పరిష్కారాలనే ఇష్టపడుతుందని అంటూనే.. తమ అధ్యక్షుడి వద్ద మరిన్ని ఎంపికలు ఉన్నాయంటూ హెచ్చరికలు చేశారు.

# నేటి నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం

అయితే రంజాన్ మాసం దాదాపు 31 ఏళ్ల తర్వాత ఫిబ్రవరిలో ప్రారంభం కాబోతోంది. గతంలో 1995 ఫిబ్రవరి 1వ తేదీన రంజాన్ మాసం మొదలైంది. అప్పటి నుంచి ఇప్పుడే మళ్లీ ఫిబ్రవరిలో రంజాన్ మాసం ప్రారంభం కావడం విశేషం. మరోవైపు రంజాన్ నేపథ్యంలో ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ముస్లిం ఉద్యోగుల పనివేళల్లో వెసులుబాటును ప్రభుత్వాలు కల్పించిన విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు అత్యంత పవిత్ర పండుగా భావించే రంజాన్ మాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. పవిత్ర మక్కా మసీదు నెలకున్న సౌదీ అరేబియాలో నెలవంక దర్శనం ఇవ్వడంతో నుంచి అధికారికంగా రంజాన్ మాసం ప్రారంభం అవుతుందని ప్రకటించారు. అలాగే సౌదీ సుప్రీం కోర్టు కూడా రంజాన్ ప్రారంభాన్ని ధృవీకరించింది. భారత్ లో సౌదీ ప్రకటనను అనుసరిస్తారు కాబట్టి ఇక్కడ కూడా రంజాన్ మాసం ప్రారంభం అయినట్టుగా భావించవచ్చు. ఇక రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు.మరోవైపు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపవాసాలు పాటించే ఉద్యోగుల సౌకర్యార్థం సాయంత్రం 4 గంటలకే విధులు ముగించుకునేలా అనుమతి ఇచ్చింది. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు ఈ మేరకు ప్రత్యేకమైన వెసులుబాటు కల్పించింది. తాజా నిర్ణయంతో ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 20 వరకు ముస్లిం ఉద్యోగులు తమ విధులను సాయంత్రం 4 గంటలకే ముగించుకునే అవకాశం ఉంటుంది. ఇక ప్రభుత్వ నిర్ణయంపై ముస్లిం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

## అమెరికాతో ట్రేడ్ డీల్..
### రష్యా చమురు దిగుమతుల్లో భారీగా కోత..!



**రష్యా నుంచి మన దేశానికి దిగుమతయ్యే వస్తువులు గణనీయంగా తగ్గాయి. ఈ ఏడాది జనవరిలో 40 శాతానికి పడిపోయాయి. ఇందులో రష్యా ముడి చమురుకు (Russian oil Imports) భారీ కోత పడింది. భారత్‌లోని శుద్ధి కర్మాగారాలు రష్యా ముడి చమురు కొనుగోళ్లను భారీగా తగ్గించడంతో ఈ పరిణామాలు జరిగినట్లు తెలుస్తోంది.**

గతేడాది జనవరిలో 4.81 బిలియన్ డాలర్ల వస్తువులను భారత్ (India) రష్యా నుంచి దిగుమతి చేసుకుంది. ఈ ఏడాది అది 2.86 బిలియన్ డాలర్లకే పరిమితమైంది. 2022 నుంచి భారీ తగ్గింపు ధరతో ముడిచమురు దిగుమతులను రష్యా ఆఫర్ చేసింది. అప్పటి నుంచి భారత్‌లో ఈ దిగుమతులు గణనీయంగా పెరిగాయి. అయితే, రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షల ఒత్తిడి పెరగడం, యూఎస్‌తో వాణిజ్య చర్చలు కొనసాగుతున్న క్రమంలో ఇటీవలి కాలంలో ఈ కొనుగోళ్లు మందగించినట్లుగా తెలుస్తోంది. కాగా.. ఇటీవల భారత్ అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం (IndiaUSA Trade) కుదిరిన సంగతి తెలిసిందే. ఇందులో రష్యా ముడి చమురు కొనుగోలుపై ప్రధానంగా చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. మాస్కో చమురు దిగుమతి చేసుకోమని భారత్ తమకు హామీ ఇచ్చిందని అగ్రరాజ్యం ప్రకటించింది. దీనిపై భారత్ స్పందిస్తూ.. దేశీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

### 'ఆంథ్రోపిక్ vs ఆంథ్రోపిక్'..
## భారత కంపెనీ న్యాయపోరాటం




ఐటీ రంగంలో కృత్రిమ మేధ సంస్థ 'ఆంథ్రోపిక్' సృష్టించిన అలజడి అంతా ఇంతా కాదు. టెక్ కంపెనీలను భయపెట్టిన ఈ అమెరికా స్టార్టప్‌కు ఇప్పుడు భారత్‌లో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. కంపెనీ పేరే అందుక్కారణం..! ఇదే 'ఆంథ్రోపిక్ (Anthropic)' పేరుతో ఇప్పటికే కర్ణాటకలో ఓ కంపెనీ కొనసాగుతోంది. తాజా స్టార్టప్ మూలంగా తమ వ్యాపారం దెబ్బతింటోందని ఆరోపిస్తూ భారత కంపెనీ యజమాని న్యాయపోరాటానికి దిగారు.

అమెరికా ఏఐ కంపెనీ ట్రేడ్‌మార్క్ నిబంధనలను ఉల్లంఘిస్తోందంటూ భారత్‌కు చెందిన 'ఆంథ్రోపిక్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అయ్యజ్ ముల్లా కోర్టును ఆశ్రయించారు. బెళగావిలోని కమర్షియల్ డివిజన్ అండ్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఫిబ్రవరి 16న కోర్టుకు రావాలని అమెరికా 'ఆంథ్రోపిక్' సంస్థ ప్రతినిధులను ఆదేశించింది. వారు గైర్హాజరవడంతో మార్చి 9న రావాలని మరోసారి సమన్లు జారీ చేసింది. 'ఆంథ్రోపిక్ సాఫ్ట్‌వేర్ ప్రైవేటు లిమిటెడ్' కంపెనీని 2017లో స్థాపించారు. అప్పటినుంచి ఐటీ రంగంలో ఈ సంస్థ సేవలందిస్తోంది. తాజా పరిణామాలపై ఈ కంపెనీ ఎండీ అయ్యజ్ ముల్లా మాట్లాడుతూ.. "మాది చిన్న సంస్థే కావొచ్చు. కానీ ఈ బ్రాండ్ పేరును మేమే ముందునుంచీ వినియోగిస్తున్నాం. విద్య, కనెక్టివిటీ, సేఫ్టీ వంటి రంగాల్లో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేశాం. anthropic.in పేరుతో మా కార్యకలాపాలు సాగిస్తున్నాం. మా కస్టమర్లకూ ఈ పేరే తెలుసు. ఇక, అమెరికా ఏఐ కంపెనీ 'ఆంథ్రోపిక్' 2021లో ప్రారంభమైంది. మా పేరునే ఉపయోగించి వారు స్టార్టప్‌ను ఏర్పాటుచేశారు. సోషల్ మీడియాలోనూ అదే పేరును వినియోగిస్తున్నారు. దీంతో ఇప్పుడు మా కస్టమర్లు ఆంథ్రోపిక్ గురించి నెట్టింట వెతికితే anthropic.com డొమైన్‌కు వెళ్తోంది. దీనివల్ల మా వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడుతోంది. మేం నష్టపోవాల్సి వస్తోంది" అని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇటీవల అమెరికా స్టార్టప్ 'ఆంథ్రోపిక్' విడుదల చేసిన కొత్త క్లాడ్ ఏఐ టూల్స్‌తో టెక్ రంగం కుదేలైన సంగతి తెలిసిందే. దీంతో ఈ పేరు నెట్టింట మార్మోగింది. అంతేకాదు.. ఈ సంస్థ భారత్‌లోనూ అడుగుపెట్టడం చర్చనీయాంశమైంది. ఇటీవలే బెంగళూరులో తన తొలి కార్యాలయాన్ని ప్రారంభించింది. మరోవైపు ఈ ఏఐ స్టార్టప్‌తో భారత టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ జట్టు కట్టింది.

### 15 రోజుల్లో డెత్‌క్లెయిమ్ సెటిల్‌మెంట్..
## బ్యాంక్‌కు వెళ్లే పనిలేకుండానే..!

కుటుంబంలో ఎవరైనా దూరమైతే వారి బ్యాంక్ ఖాతాలోని నగదును పొందాలంటే బ్యాంకుల చుట్టూ తిరగాల్సిందే. మరణ ధ్రువీకరణ పత్రం, పాస్‌బుక్, మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యుడు అని తెలిపేలా రుజువు పత్రాలు వంటివి పట్టుకెళ్లినా ఒక్కోసారి పని జరుగుతుందన్న గ్యారెంటీ లేదు. దీంతో చిన్న మొత్తంలో నగదు ఉన్న సందర్భాల్లో కుటుంబ సభ్యులు ఆ నగదును అలానే వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (IOB) సులభతర విధానాన్ని పరిచయం చేసింది. డెత్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ కోసం ఆన్‌లైన్ సదుపాయాన్ని తీసుకొచ్చింది. బ్యాంకు ఖాతాదారులు మరణించిన సందర్భాల్లో కుటుంబ సభ్యులు, వారి వారసులు బ్యాంకును సందర్శించకుండానే ఈ డెత్‌క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.15 లక్షల వరకు నగదు సెటిల్‌మెంట్‌కు ఎలాంటి థర్డ్ పార్టీ ష్యూరిటీ అవసరం లేదని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పేర్కొంది. పైగా 15 రోజుల వ్యవధిలోనే క్లెయిమ్‌లను సెటిల్ చేస్తామని వెల్లడించింది. ఇందుకోసం ఐఓబీ పోర్టల్‌లో డెత్‌క్లెయిమ్ సెటిల్‌మెంట్ విభాగంలోకి వెళ్లి.. సంబంధిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. క్లెయిమ్ ఫారం, ఖాతాదారుడి డెత్ సర్టిఫికెట్, నామినీ గుర్తింపు పత్రాలను అప్‌లోడ్ చేయాలి. నామినీ లేని పక్షంలో ఇండెమ్నిటీ బాండ్, డిస్‌క్లెయిమర్ లెటర్, లీగర్‌హెయిర్ సర్టిఫికెట్ వంటివి సమర్పించాల్సి ఉంటుంది.

ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు..

డెత్‌క్లెయిమ్‌లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) గతేడాది సెప్టెంబర్‌లో కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. చనిపోయిన వారి బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిబంధనలను సవరించింది. 15 రోజుల గడువులోగా సెటిల్‌మెంట్ ప్రక్రియ పూర్తవ్వాలని, ఒక వేళ ఆలస్యమైతే నిర్దిష్ట పరిహారాన్ని నామినీలకు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. 2026 మార్చి 31లోపు అన్ని బ్యాంకులూ ఈ మార్గదర్శకాలను పాటించాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ సౌలభ్యాన్ని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తీసుకొచ్చింది. మిగిలిన బ్యాంకులూ ఈ తరహా సదుపాయాన్ని తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

# ఆఖర్లో కొనుగోళ్లు.. మూడో రోజూ లాభాల్లో సూచీలు

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. ముఖ్యంగా మెటల్, ప్రభుత్వరంగ బ్యాంక్ స్టాక్స్ సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగియగా.. నిఫ్టీ 25800 ఎగువన స్థిరపడింది.**

సెన్సెక్స్ ఉదయం 83,553.59 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,450.96) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 83,163.62 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత మళ్లీ లాభాల బాట పట్టింది. చివరికి 283.29 పాయింట్ల లాభంతో 83,734.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93.95 పాయింట్ల లాభంతో 25,819.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4922 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## భారత్‌అమెరికా మధ్య సబ్‌సీ కేబుల్ కనెక్టివిటీ: సుందర్ పిచాయ్

**భారత్-అమెరికా మధ్య సబ్-సీ కేబుల్ కనెక్టివిటీని (సముద్రగర్భంలో కేబుళ్లు) ఏర్పాటు చేయనున్నట్లు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఏఐ అనుసంధానత పెంచేందుకు సబ్‌సీ కేబుల్ రూట్‌లను వేయనున్నట్లు పేర్కొన్నారు. భారత్‌లో జరుగతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొన్న ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. భారత్-అమెరికాతో పాటు దక్షిణార్ధగోళంలోని పలు ప్రాంతాలను ఈ కేబుల్ నెట్‌వర్క్ ద్వారా అనుసంధానత పెంచనున్నట్లు తెలిపారు.**

"ఏఐ అనేది అతిపెద్ద మార్పు. వైద్య రంగంలో పరీక్షలు, చికిత్సలు, రైతులకు రియల్ టైమ్ హెచ్చరికలతో అలర్ట్‌లు ఇవ్వడం వంటి వాటిలో ఏఐ సహాయపడనుంది. ఎన్నో సవాళ్లను పరిష్కరించనుంది" అని చెప్పారు. భారతదేశ ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో గూగుల్ భాగస్వామ్యం కానుందన్నారు. భారతదేశ వైవిధ్యం, లాంగ్వేజ్ ఎకోసిస్టమ్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్నోవేషన్‌కు బలమైన పునాది అని పేర్కొన్నారు. నైపుణ్య శిక్షణలో భాగంగా గూగుల్ ఏఐ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఏమిటీ సబ్‌సీ కనెక్టివిటీ?

భారత్ అమెరికా మధ్య కనెక్టివిటీలో భాగంగా కొత్త సబ్‌సీ కేబుల్ రూట్లు, ఫైబర్‌ఆప్టిక్ రూట్లు, అంతర్జాతీయ ల్యాండింగ్ స్టేషన్లను అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం రాబోయే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్లను భారత్‌లో గూగుల్ వెచ్చించనుంది. దీని వల్ల భారత్ అమెరికాతో పాటు దక్షిణార్ధగోళంలోని ఆఫ్రికా, ఆసియా, పసిఫిక్‌కు కూడా కనెక్టివిటీ పెరుగుతుంది. నెట్‌వర్క్ రీచ్, రియబలిటీ పెరుగుతుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా భారత్ నుంచి సింగపూర్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాకు మూడు సబ్‌సీ రూట్లు ఏర్పాటు చేయనున్నారు. అమెరికా భారత్ మధ్య దక్షిణర్ధగోళంలోని ఇతర ప్రాంతాలను కలుపుతూ నాలుగు స్ట్రాటజిక్ ఫైబర్ ఆప్టిక్ రూట్లను ఏర్పాటు చేస్తారు. ముంబయి, చెన్నైలో ఉన్న ల్యాండింగ్ పాయింట్లపైనే పూర్తిగా ఆధారపడకుండా విశాఖపట్నంలో కొత్త అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వేను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల డేటా ట్రాన్స్‌ఫర్ వేగం పెరుగుతుంది. నెట్‌వర్క్ అంతరాయాలు తగ్గుతాయి. భారతదేశ డిజిటల్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.



# భారత్ విశ్వాసంతో ఉంది..
# లేబర్ మార్కెట్ మారుతుంది: రిషి సునాక్

కృత్రిమ మేధ శరవేగంగా దూసుకొస్తున్న తరుణంలో భారత్ ఏఐ ఇంపాక్ట్ సదస్సును నిర్వహిస్తూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా దిల్లీకి వచ్చిన అంతర్జాతీయ ప్రముఖులు, రాజకీయ నేతలు తమ అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఏఐ విషయంలో భిన్నమైన వైఖరులు కనిపిస్తున్నాయని బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ (Rishi Sunak) అన్నారు. లేబర్ మార్కెట్ మారుతోందన్నారు. "భారత్‌వంటి దేశాలు ఈ సరికొత్త సాంకేతిక ప్రగతి పట్ల విశ్వాసం, ఆశావాదం వ్యక్తంచేస్తున్నాయి. అదే సమయంలో పాశ్చాత్య దేశాల్లో ఆందోళన కనిపిస్తోంది" అని పేర్కొన్నారు. విధానపరమైన నిర్ణయాలతో ఈ అంతరాలను పూడ్చవచ్చన్నారు. ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. ప్రజలు దానిని అర్థం చేసుకునే తీరు ప్రాంతాలవారీగా మారుతుందన్నారు.

**లేబర్ మార్కెట్ మారుతుంది..**

"ఏఐతో లేబర్ మార్కెట్ మారుతుంది. కొన్ని ఉద్యోగాలు పోతాయి. కొన్ని ఉద్యోగాల్లో మార్పులు చోటు చేసుకుంటాయి. పరివర్తనను చక్కగా నిర్వహించిన సమాజాలు అభివృద్ధి చెందినట్లు చరిత్ర చెప్తోంది" అని ఉద్యోగాల గురించి వ్యక్తమవుతోన్న ఆందోళనపై స్పందించారు. అలాగే రోజూవారీ జీవితంలో మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి ఏఐ తనకు ఉపకరిస్తోందని చెప్పారు.



### తగ్గిన బంగారం దిగుమతులు ...
## తగ్గేదేలే అంటున్న వెండి..!



**అంతర్జాతీయంగా ధరలు పెరుగుతున్నా.. దేశంలోకి బంగారం, వెండి దిగుమతులు మాత్రం పెద్ద మొత్తంలో కొనసాగుతున్నాయి. అయితే, బంగారం విషయంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో దీని దిగుమతులు తగ్గుముఖం పట్టగా.. వెండి కొనుగోళ్లు మాత్రం భారీగా పెరిగాయి. ఈ మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత 9 నెలల గణాంకాలను వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసింది.**

**ఏప్రిల్- డిసెంబర్ మధ్య దేశంలో బంగారం ధరలు సగటున 25 శాతం మేర పెరిగాయి. ధరలు భారీగా పెరగడంతో దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. 9 నెలల కాలంలో దిగుమతులు 18.3 శాతం తగ్గి 522 టన్నులకు పరిమితమైంది. విలువ పరంగా చూసినప్పుడు పసిడి దిగుమతుల బిల్లు 1.8 శాతం పెరిగి 49.4 బిలియన్ డాలర్లుగా నమోదైందని వాణిజ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.**

**మరోవైపు వెండి ధరలు సగటున 46.7 శాతం మేర పెరిగాయి. అయినా దిగుమతులు ఏకంగా 56 శాతం పెరిగి 5,727 టన్నులు భారత్‌లోకి వచ్చింది. విలువపరంగా చూస్తే ఈ మొత్తం 7.8 బిలియన్ డాలర్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే 9 నెలల కాలంలో నమోదైన 3.4 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఈ మొత్తం రెట్టింపు కావడం గమనార్హం. పసిడిని కేవలం పెట్టుబడి సాధనంగా భావిస్తుండగా.. వెండికి అటు ప్రజల నుంచి ఇటు పరిశ్రమల నుంచి డిమాండ్ ఉండటం ఈ పరిస్థితి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.**

### చాకు విక్రయాలు..
### బ్లింకిట్‌పై కేసు నమోదు

blinkit
India's Last Minute App

**క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ (BlinkIt)పై దిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో ఫోల్డింగ్ పాకెట్ చాకుల (Button Knives)ను విక్రయించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల దేశరాజధానిలో జరిగిన రెండు వేర్వేరు హత్య కేసుల్లో నిందితులు ఉపయోగించిన కత్తులను బ్లింకిట్ నుంచి కొనుగోలు చేసినట్లు తేలడంతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం, 7.62 సెం.మీ పొడవు, 1.72 సెం.మీ వెడల్పు గల బ్లేడ్లు ఉన్న ఫోల్డింగ్ పాకెట్ చాకులను మాత్రమే ఆన్‌లైన్‌లో విక్రయించాలి. కాగా నిందితులు వినియోగించిన చాకులు 8సెం.మీ పొడవు, 2.5సెం.మీ వెడల్పుతో ఉన్నాయి. దీంతో ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా వీటిని విక్రయిస్తున్నందుకు ఆయుధ చట్ట ఉల్లంఘన కింద పోలీసులు బ్లింకిట్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం దిల్లీలోని అన్ని బ్లింకిట్ స్టోర్లపై దాడి చేసి..55కి పైగా చాకులను స్వాధీనం చేసుకున్నారు.

### రుచి, వాసన కోల్పోయా..
### అనారోగ్యంపై మొదటిసారి స్పందించిన మమ్ముట్టి

మలయాళ అగ్ర కథానాయకుడు మమ్ముట్టి (Mammootty) పూర్తిగా కోలుకొని తిరిగి షూటింగ్‌లతో బిజీగా గడుపుతున్నారు. చిన్న ఆరోగ్య సమస్య కారణంగా నటనకు కొన్ని నెలలు బ్రేక్ ఇచ్చిన ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన హెల్త్ గురించి మొదటిసారి పంచుకున్నారు. ఆ సమయంలో రుచి, వాసన కోల్పాయనని అన్నారు.

“ప్రతి మనిషికి కంటిచూపు, వినికిడి ఎంతో ముఖ్యమైనవి. అయితే ఊపిరి పీల్చుతున్నప్పుడు ఏ వాసన రాకపోతే ఆందోళన కలుగుతుంది. నేను ఆ సమస్యతో బాధ పడ్డాను. చాలాకాలం రుచి, వాసన కోల్పోయాను. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా వాటిని తిరిగి పొందుతున్నాను. అటువంటి సామర్థ్యాలను కోల్పోయినప్పుడు మాత్రమే వాటి విలువ మనకు అర్థం అవుతుంది. ఎవరైనా పెద్దగా మాట్లాడినప్పుడు మనం చిన్నగా మాట్లాడమని అడుగుతాం. వినగలుగుతున్నాం కాబట్టి వాళ్లతో చెప్పాం.. అసలు వినలేని వాళ్లు ఏమీ అనలేరు. ఎలా మాట్లాడినా వారికి తేడా కనిపించదు. వినగలగడం కూడా ఒక వరం” అని ఆయన అన్నారు.


మమ్ముట్టికి ఏమైంది అనేది అధికారికంగా వెల్లడించనప్పటికీ గతేడాది జూన్‌లో ఆయన అనారోగ్యానికి గురైనట్లు వార్తలు వచ్చాయి. 4 నెలలు విరామం తీసుకున్నారు. ఆరోగ్యం బాగా లేదన్నమాట వాస్తవమే కానీ.. అది చాలా చిన్న సమస్య అని ఆయన టీమ్ ప్రకటించింది. ప్రస్తుతం ఆయన ‘పేట్రియాట్’లో నటిస్తున్నారు. మహేశ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంలో ఆయనతో పాటు మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఫహాద్ ఫాజిల్ విలన్‌గా నటిస్తున్నారు.





# ప్రియమణి.. ఇండో-హాలీవుడ్ చిత్రం

తెరపై వైవిధ్యమైన పాత్రలతో భావోద్వేగాలను పంచడంతోపాటు.. యాక్షన్ సన్నివేశాలతోనూ అదరగొడుతుంది నటి ప్రియమణి. ఇప్పుడామె ఖాతాలో ఓ హాలీవుడ్ నిర్మాణసంస్థ రూపొందించనున్న కొత్త ప్రాజెక్ట్ చేరింది. ఈ సినిమాలో ప్రియమణి, బాలీవుడ్ నటుడు మోహిత్ రైనా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి హర్ష్ మహదేశ్వర్ దర్శకత్వం వహించనున్నారు. అమెరికాకు చెందిన రెడ్‌బైసన్ ప్రొడక్షన్స్, ముంబయిలోని అజూర్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా నిర్మాణసంస్థలు ఇన్‌స్టాలో ప్రకటించాయి. ‘భారతీయ, అమెరికన్ కథలు ఒకే గ్రాండ్ కన్వాస్‌పై కలిసి రావడం కొత్త అధ్యయనాన్ని తెలియజేస్తుంది. హాలీవుడ్ బ్లాక్‌బస్టర్‌ల నుంచి అగ్రశ్రేణి సిబ్బందితో ఈ సినిమాని శక్తిమంతమైన కథగా రూపొందించనున్నా’మనే వ్యాఖ్యల్ని జోడించాయి. ఇండో-హాలీవుడ్ ఫీచర్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా వలస కుటుంబ భావోద్వేగాలను.. వారి సంప్రదాయ ఆలోచనలను మించి సాగే సాంస్కృతిక ప్రయాణాన్ని అన్వేషించే వాస్తవిక కథ ఆధారంగా రూపొందించనున్నారని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా చిత్రీకరణ ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం.



## విజయ్- రష్మిక పెళ్లి..
# శుభలేఖ లీక్‌పై టీమ్ అసహనం!



విజయ్ దేవరకొండ (Vijay Deverakonda)- రష్మిక (Rashmika) వివాహం ఈ నెల 26న జరగనుందంటూ ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో వారి వెడ్డింగ్ కార్డు లీక్ అయి, అది నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై నటుడి టీమ్ స్పందించింది. వివాహం, రిసెప్షన్‌కు సంబంధించిన అన్ని వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం కరెక్ట్ కాదంటూ అసహనం వ్యక్తం చేసింది.

“విజయ్, రష్మిక వివాహానికి సంబంధించి కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. పెళ్లి, రిసెప్షన్.. వివరాలన్నింటినీ వెల్లడిస్తున్నారు. దీనివల్ల వివాహ వేడుకకు హాజరయ్యే అతిథులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశాలున్నాయి. వీరి పెళ్లి వేడుకలకు టాలీవుడ్, బాలీవుడ్‌కు చెందిన వారితోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారు. అందుకే వివాహ వేడుకలకు సంబంధించిన వివరాలను సామాజిక మాధ్యమాల్లో వెల్లడించడం సరికాదు. పెళ్లికి హాజరయ్యే అతిథులు కాంటాక్ట్ కావాల్సిన ఫోన్ నెంబర్‌నూ వెడ్డింగ్ కార్డుపై ప్రింట్ చేస్తే.. దానినీ పోస్ట్ చేశారు. ఈ విషయంలో సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. పెళ్లి అనేది పూర్తిగా వ్యక్తిగత విషయం. అలాంటి పర్సనల్ ఈవెంట్‌కు సంబంధించి పోస్టులు పెట్టే ముందు వాటి ద్వారా ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయనేది గమనించుకోవాలి” అని విజయ్ టీమ్ పేర్కొంది.

## అందుకే సినిమాల అడ్వాన్స్
# తిరిగి ఇచ్చేశా...: రానా



‘బాహుబలి’లో భల్లాల దేవ పాత్రలో నటించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు టాలీవుడ్ నటుడు రానా దగ్గుబాటి (Rana Daggubati). ఈ చిత్రం కోసం శారీరకంగా ఎంత కష్టపడ్డారన్నది అందరికీ తెలిసిందే. ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాల గురించి తాజాగా మరో ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. అన్నింటి కన్నా ఆరోగ్యం ముఖ్యమని పేర్కొన్నారు.

“నాకు ఆరోగ్య సమస్య ఉందని తెలిసినప్పుడు షాకయ్యా. సర్జరీ కోసం యూఎస్ వెళ్లా. కుటుంబాన్ని విడిచి కొన్ని రోజులు ఉన్నాను. నేను ఒంటరిగా ఉండటం జీవితంలో అదే తొలిసారి. నేనెవరు? అన్న ప్రశ్నకు ఆ సమయంలోనే సమాధానం దొరికింది. అప్పటినుంచి జీవితాన్ని కొత్తగా చూస్తున్నా. హెల్త్ ప్రాబ్లమ్ గురించి తెలిశాక.. అప్పటికే అంగీకరించిన కొన్ని ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చింది. వాటిలో రెజ్లర్ స్టోరీ కూడా ఉంది. శారీరాకృతిలో మార్పు రావడం వల్ల ఆయా కథలకు నేను సరిపోనని అర్థమైంది. అందుకే.. తీసుకున్న అడ్వాన్స్‌ను నిర్మాతలకు తిరిగి ఇచ్చేశా. యూఎస్ నుంచి భారత్‌కు వచ్చేటప్పుడు ఓ ఇమిగ్రేషన్ అధికారి నన్ను గుర్తుపట్టి ‘కింగ్ భల్లాల దేవ’ అని అనడం మళ్లీ ‘బాహుబలి’ రోజులను గుర్తుచేసింది” అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

వరుణ్‌తేజ్‌లో నేను!: రానా

“నా స్నేహితుడు, నటుడు వరుణ్‌తేజ్ ఓరోజు నన్ను పరామర్శించేందుకు వచ్చాడు. అతడు కూడా నాలాగే ఎత్తుగా, ఫిట్‌గా ఉంటాడు. ఆరోజు నన్ను నేను అతడిలో చూసుకున్నా. నేను చేయాల్సిన సినిమాలను వరుణ్‌కు ఇచ్చేద్దామా? అని కూడా అనిపించింది” అని పేర్కొన్నారు. తనకు కిడ్నీలు పాడయ్యాయని రానా గతంలో తెలిపిన విషయం తెలిసిందే. ఆయన కుడి కన్నుకూ శస్త్ర చికిత్స జరిగింది. సోలో హీరోగా రానా సినిమా వచ్చి చాలా కాలమైంది. ‘వేట్టయాన్’లో రజనీకాంత్‌తో కలిసి నటించిన ఆయన.. ‘స్పై’, ‘మిరాయ్’, ‘కాంత’, ‘పరాశక్తి’లో అతిథి పాత్రలు పోషించారు. నిర్మాతగా బిజీ అయ్యారు. ‘హనుమాన్’ మూవీ సీక్వెల్ ‘జై హనుమాన్’లో రానా కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

## నా సక్సెస్‌కు కారణం
## నా ప్రతిభే అనుకుంటారు.. కానీ..



తాను ఈ స్థాయిలో ఉండడానికి కారణం తన భార్య సురేఖ అని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా కొన్ని ఫొటోలు పంచుకున్న చిరు (Chirnajeevi).. ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

“నా ప్రతి అడుగులో నా వెంట నడిచిన నీకు శుభాకాంక్షలు. 1980 ఫిబ్రవరి 20న మనం వివాహం చేసుకున్న నాటినుంచి నువ్వే నా బలంగా మారావు. ఈరోజు నీ పుట్టినరోజుతో పాటు రెండు రోజుల ముందుగానే మన వివాహ వార్షికోత్సవం కూడా చేసుకోవడం నాకు ఆనందంగా ఉంది. నీ ప్రేమ, ఆప్యాయతలతో కుటుంబం మొత్తాన్ని నడిపిస్తున్నావు. నా తల్లిని సొంత బిడ్డలా చూసుకుంటావు. నా విజయ రహస్యం ఏమిటని ఎవరైనా అడిగితే.. నా ప్రతిభ, కృషి కాదు.. నువ్వే అని చెబుతాను. నువ్వు కుటుంబ బాధ్యతను చూసుకున్నావు కాబట్టే నేను నటనపై శ్రద్ధ పెట్టాను. కష్టసుఖాల్లో మమ్మల్ని ఒకేతాటిపై నడిపించావు. నీవల్లే నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను” అని చిరు తన ప్రేమను తెలిపారు.

ఇక సినిమాల విషయానికొస్తే.. ఇటీవలే ‘మనశంకర వరప్రసాద్ గారు’తో సూపర్ హిట్‌ను అందుకున్న ఆయన ప్రస్తుతం ‘విశ్వంభర’లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా కనిపించనున్నారు. దీన్ని జులై 9న ప్రేక్షకుల ముందుకుతీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.



### పాకిస్థాన్‌పై ధనాధన్ ఇన్నింగ్స్..

## టాప్ 10లోకి ఇషాన్



భారత ఆటగాడు ఇషాన్ కిషన్ పునరాగమనం తర్వాత విజృంభిస్తున్నాడు. టీ20 ప్రపంచ కప్‌లో వరుసగా అద్భుత ఇన్నింగ్స్‌లతో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. పాకిస్థాన్‌పై అదిరే ఇన్నింగ్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచాడు. అదే అతడిని ఐసీసీ ర్యాంకుల్లో టాప్ 10లోకి తీసుకొచ్చింది. ఇషాన్ (732 పాయింట్లు) ఏకంగా 17 స్థానాలు ఎగబాకి మరీ 8వ ర్యాంకుకు చేరాడు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ (891 పాయింట్లు), ఫిల్ సాల్ట్ (808) తొలి రెండు ర్యాంకులను నిలబెట్టుకున్నారు. సెంచరీ హీరో, శ్రీలంక ఆటగాడు పాతున్ నిశాంక (786) మూడో స్థానానికి వచ్చాడు. నాలుగైదు ర్యాంకుల్లో తిలక్ వర్మ (751), సహబ్జాద ఫర్హాన్ (748) ఉన్నారు.

**వరుణ్‌దే అగ్రస్థానం..**

టీ20 ఫార్మాట్ బౌలర్ల జాబితాలో భారత ఆటగాడు వరుణ్ చక్రవర్తి (796) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. రషీద్ ఖాన్ (740) ఒక్కస్థానం మెరుగై రెండో ర్యాంకుకు చేరాడు. అబ్రార్ అహ్మద్ (734) మూడో స్థానానికి పడిపోయాడు. అదిల్ రషీద్ (703) నాలుగులో కొనసాగుతుండగా.. టీ20 ప్రపంచ కప్‌లో జింబాబ్వే సూపర్ 8కి చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన బ్రాడ్ ఇవాన్స్ (680) ఐదో స్థానంలోకి దూసుకొచ్చాడు. అతడు 10 ప్లేస్‌లను ఎగబాకాడు. భారత ఆటగాళ్లు అక్షర్ పటేల్ (642) 14వ స్థానం, జస్‌ప్రీత్ బుమ్రా (640) 15వ ర్యాంకుకు చేరారు. ఆల్ రౌండర్ల జాబితాలో పాకిస్థాన్ క్రికెటర్ సైమ్ అయూబ్ (303), జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా (297), భారత్ స్టార్ హార్దిక్ పాండ్య (282) తొలి మూడు ర్యాంకుల్లో నిలిచారు

## మిస్టర్ మ్యాగ్జిమమ్.. మినిమమ్ అయ్యాడెందుకు?




**మిస్టర్ మ్యాగ్జిమమ్... టీమ్ ఇండియా క్రికెట్‌లో అభిషేక్ శర్మ (Abhishek Sharma) ముద్దు పేరు ఇది. క్రీజులోకి వస్తే భారీ షాట్లు, స్కోర్లు చేస్తాడని అలా పిలుస్తారు. ప్రపంచకప్ ముందు వరకు అందరూ ఈ పేరుతోనే పిలిచారు. సూపర్ 8 దశకు రెడీ అవుతున్న వేళ మ్యాగ్జిమమ్ కాస్తా మినిమమ్ అయిపోయింది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్‌లో అభి.. ఇప్పుడు ఏదో కంగారులో ఉన్నాడు అనిపిస్తోంది. ఇది భారత క్రికెట్‌నూ ఇబ్బందిపడేలా చేస్తోంది.**

అభిషేక్ గత ఏడు ఇన్నింగ్స్‌లు చూస్తే... ఐదు డకౌట్‌లు, ఒక 30, మరో 68* పరుగులు ఉన్నాయి. టీ20 ప్రపంచకప్‌లో అయితే మూడుకి మూడు మ్యాచుల్లో డకౌట్. తన ఏడాదిన్నర టీ20 కెరీర్‌లో ఇలాంటి ఇబ్బందికర పరిస్థితిలో ఎప్పుడూ లేడు. కెరీర్ తొలి మ్యాచులో డకౌట్ అయ్యాక మళ్లీ సున్నా ముఖమే చూడలేదు. కానీ ఇప్పుడు రెండు నెలల వ్యవధిలో ఐదు సున్నాలు చూశాడు. దీనికి కారణమేంటా అని చూస్తే.. తొలి బంతి నుంచి భారీ షాట్లు ఆడాలి అనే ఆలోచనే అని అర్థమవుతోంది. పిచ్, బంతి, వాతావరణం, బౌలర్ లాంటి అంశాలను మరచిపోయి బంతి కనిపిస్తే కొట్టేద్దాం అనుకుంటున్నాడు అనిపిస్తోంది. ఈ టీ20 ప్రపంచకప్ టోర్నీలో డకౌట్ అయిన మూడు సందర్భాలూ భారీ షాట్‌కి ప్రయత్నించినవే కావడం గమనార్హం.

**ప్లానా? కంగారా?**

పోనీ ప్రపంచంలో మేటి జట్ల బౌలర్ల చేతిలో ఔటయ్యాడు అని అంటే అదీ లేదు. యూఎస్ఏ, నెదర్లాండ్స్ లాంటి అసోసియేట్ దేశాల కొత్త బౌలర్లకు వికెట్ చేజేతులా సమర్పించుకున్నాడు. అభిషేక్‌ని ఔట్ చెయ్యాలని వాళ్లు పక్కాగా ప్లాన్ చేశారో? లేక ప్రపంచకప్ అనే కంగారులో అవుటైపోతున్నాడో తెలియడం లేదు. 'సింగిల్ తీయ్.. అంతా సెట్ అవుతుంది' అని దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ అంటున్నారు. తన గురువు యువరాజ్ సింగ్ అయితే ఇంకాస్త గట్టిగానే చెప్పి ఉంటాడు.

ఎందుకో మరి అభిషేక్ బ్యాటింగ్‌లో బాగా ఇబ్బందిపడుతున్నాడు. ఒకవేళ గత ప్రదర్శన గుర్తుపెట్టుకుని అతన్ని సూపర్ 8 మ్యాచ్‌లకు జట్టులోకి తీసుకుంటే తొలుత చేయాల్సిన పని క్రీజులో నిలదొక్కుకోవడం. లేదంటే టీమ్ ఇండియా డోర్స్ మూసుకుపోవడం పెద్ద విషయం కాదు. 'కాబోయే కెప్టెన్' అనే పరపతితో 'వైస్ కెప్టెన్‌గా జట్టులోకి వచ్చిన శుభ్‌మన్ గిల్‌నే పక్కన పెట్టి 'మాకు ఆట ముఖ్యం' అని చెప్పిన సెలక్షన్ కమిటీ, టీమ్ మేనేజ్‌మెంట్ ఉన్న జట్టు మనది. కాబట్టి. 'అభి కాస్త కంట్రోల్ అవ్వమ్మా.. కంగారు వలదు'. లేదంటే 'రోహిత్‌కి వారసుడు' అని అంటున్న వాళ్లే 'ఇక చాలు' అని అంటారు.

# టీ20 ప్రపంచ కప్..

# నెదర్లాండ్స్‌పై భారత్ విజయం

- టీ20 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌పై భారత్ 17 పరుగుల తేడాతో విజయం
- ఆల్ రౌండర్ శివమ్ దుబే అద్భుత ప్రదర్శన
- బ్యాటింగ్‌లో 66 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసిన దుబే
- మూడు వికెట్లతో సత్తా చాటిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి
- గ్రూప్-ఏలో చివరి లీగ్ మ్యాచ్‌ను విజయంతో ముగించిన టీమిండియా






టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. గ్రూప్‌ఏలో భాగంగా తన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. ఆల్ రౌండ్ ప్రదర్శనతో శివమ్ దుబే ఈ మ్యాచ్‌లో హీరోగా నిలిచాడు. బ్యాటింగ్‌లో అద్భుత అర్ధశతకం సాధించడంతో పాటు బౌలింగ్‌లోనూ కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. గ్రూప్ ఏలో భారత్ వరుసగా నాలుగు మ్యాచ్ లు గెలిచి, ఓటమన్నదే లేకుండా సూపర్ 8లోకి అడుగుపెట్టనుంది.

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు నెదర్లాండ్స్ తో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆదిలోనే అభిషేక్ శర్మ (0) వికెట్ కోల్పోయినప్పటికీ, ఇషాన్ కిషన్ (18) వేగంగా ఆడాడు. ఆ తర్వాత తిలక్ వర్మ (31), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (34) నిలకడగా రాణించారు. అయితే, అసలు సిసలు విధ్వంసం సృష్టించింది శివమ్ దూబేనే. కేవలం 31 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 66 పరుగులు చేశాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (30) కూడా రాణించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. నెదర్లాండ్స్ బౌలర్లలో లోగాన్ వాన్ బీక్ 3, ఆర్యన్ దత్ 2 వికెట్లు తీశారు.

194 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ గట్టిగానే పోరాడింది. బాస్ డి లీడ్ (33), కోలిన్ అకెర్మాన్ (23), జాక్ లయన్‌కాచెట్ (26) రాణించారు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఒత్తిడి పెంచారు. ముఖ్యంగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కేవలం 14 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి నెదర్లాండ్స్ పతనాన్ని శాసించాడు. శివమ్ దూబే బంతితోనూ రాణించి 2 వికెట్లు తీయగా, బుమ్రాకు ఒక వికెట్ దక్కింది. దీంతో నెదర్లాండ్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

ఈ విజయంతో భారత్ గ్రూప్ దశను అజేయంగా ముగించింది. తద్వారా 4 మ్యాచ్ ల్లో 4 విజయాలతో గ్రూప్‌ఏలో టాపర్ గా నిలిచింది.

**సూపర్-8లో గ్రూప్-1లో ఉన్న భారత్... ఫిబ్రవరి 22న దక్షిణాఫ్రికాతో, ఫిబ్రవరి 26న జింబాబ్వేతో, మార్చి 1న వెస్టిండీస్ తో తలపడనుంది.**



# టీ20లంటే ఎందుకీ 'కంగారూ'?

**ఆస్ట్రేలియా.. ఈ పేరు చెప్పగానే ఒకప్పుడు మిగిలిన జట్లు వణికిపోయేవి. అలాంటి జట్టుకు ఓ బలహీనత ఉంది. అది షార్ట్ ఫార్మాట్! ఆరంభం నుంచి కంగారూలకు టీ20లు కొరుకుడు పడలేదు. ఇన్ని టీ20 ప్రపంచకప్‌లు (ICC Mens T20 World Cup) జరిగితే ఒక్కసారి మాత్రమే ఆ జట్టు విజేతగా నిలవడమే ఇందుకు నిదర్శనం. తాజా టీ20 ప్రపంచకప్‌లోనూ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన ఆస్ట్రేలియా లీగ్ దశలోనే నిష్క్రమించింది. జింబాబ్వే లాంటి చిన్న జట్టు చేతిలో ఓడి అపకీర్తినీ మూటగట్టుకుంది.**




**తొలి టోర్నీలోనూ..**

టెస్టు, వన్డే ఫార్మాట్‌లకు వచ్చేసరికి ఆస్ట్రేలియా పటిష్టమైన జట్టు. కానీ టీ20ల్లో మాత్రం ఆ జట్టు తడబడుతోంది. 2007 తొలి టీ20 ప్రపంచకప్ నుంచీ ఇదే వరుస. ఈ కప్‌లో జింబాబ్వే చేతిలో కంగారూ జట్టు ఓడడం అప్పట్లో పెద్ద సంచలనం. ఎందుకంటే ఆస్ట్రేలియా అంటే మిగిలిన జట్లు వణికే రోజులవి. అలాంటిది కీలక ఆటగాళ్లు లేకపోయినా జింబాబ్వే ఆ జట్టును ఓడించింది. తొలి టోర్నీలో సెమీఫైనల్ వరకు వచ్చిన ఆసీస్.. 2009లో గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టింది. 2010లో మైకేల్ క్లార్క్ సారథ్యంలో కాస్త మెరుగ్గా ఆడినా.. ఫైనల్లో ఓడి మళ్లీ నిరాశ పడింది. 2012లో సెమీఫైనల్లో, 2014, 2016 టోర్నీల్లో సూపర్10లోనే ఓడిపోయిన ఆ జట్టుకు 2021లో అదృష్టం కలిసొచ్చింది. ఆరోన్ ఫించ్ కెప్టెన్సీలో తొలిసారి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది. కానీ అదీ గాలివాటమే అనిపించేలా తర్వాతి టోర్నీలో తడబడింది. 2022లో సూపర్12, 2024లో సూపర్8 దశలోనే నిష్క్రమించింది. ఈసారి టీ20 ప్రపంచకప్‌లో మరింత చెత్త ప్రదర్శన చేసింది ఆసీస్. కంగారూలను కంగుతినిపించిన జింబాబ్వే.. మెరుగైన ప్రదర్శనతో సూపర్8 చేరడంతో ఆసీస్‌కు ఇంటిముఖం పట్టక తప్పలేదు.

**జట్టు ఎంపికలో లోపాలు..**

టీ20 ప్రపంచకప్‌నకు స్టీవ్ స్మిత్‌లాంటి స్టార్‌ను ఎంపిక చేయకపోవడం ఆస్ట్రేలియా చేసిన పెద్ద తప్పు. ఉపఖండంలో మెరుగైన రికార్డే ఉన్న స్మిత్.. కచ్చితంగా జట్టు బ్యాటింగ్‌కు వెన్నెముకగా ఉండేవాడు. స్టాయినిస్, మ్యాక్స్‌వెల్‌లాంటి ప్లేయర్లు స్థాయికి తగ్గట్టు ఆడలేకపోయారు. కచ్చితంగా ఆడాల్సిన సమయంలో బ్యాట్లెత్తేశారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న ట్రావిస్ హెడ్ సైతం ఈసారి మ్యాజిక్ చూపించలేకపోయాడు. ఆల్‌రౌండర్ గ్రీన్ తేలిపోయాడు. బౌలింగ్ దాడిలో పదును లోపించడం కూడా ఆసీస్‌ను దెబ్బ తీసింది. కీలక పేసర్లు కమిన్స్, హేజిల్‌వుడ్ లేకపోడం ఆ జట్టు బౌలింగ్‌ను బాగా బలహీనపరిచింది. బౌలింగ్‌లో ప్రణాళికలను పక్కాగా అమలు చేయకపోవడం, ఉపఖండ పరిస్థితులకు తగ్గట్టుగా సర్దుబాటు చేసుకోకపోవడం ఆస్ట్రేలియాను ముంచింది.

**దిగ్గజ ఆటగాళ్లు రిటైరైన తర్వాత..**

ఆసీస్ అంటే దూకుడుగా ఆడే జట్టు. కానీ టీ20ల్లో దూకుడు మాత్రమే సరిపోదు. ప్రణాళికతో ఆడుతూ ముందుకెళ్లాలి. చాలా ఏళ్లుగా ఆ జట్టులో ఇదే లోపిస్తోంది. దిగ్గజ ఆటగాళ్లు రిటైరైన తర్వాత.. ఒక బలమైన టీ20 జట్టును తయారు చేసుకోవడంలో ఆస్ట్రేలియా విఫలమైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మెరుగు కాకపోతే ముమ్ముందు సైతం టీ20ల్లో ఆసీస్‌కు చిన్న జట్ల చేతుల్లోనూ పరాభవాలు తప్పేట్టు లేవు.

# నమీబియాపై ఘన విజయం.. సూపర్ 8కి పాకిస్థాన్

**టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్ సూపర్-8కి చేరుకుంది. కీలకమైన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో నమీబియాపై 102 పరుగుల తేడాతో పాక్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 20 ఓవర్లలో 199/3 స్కోరు చేసింది. అనంతరం నమీబియా 17.3 ఓవర్లలో 97 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ స్టీన్‌క్యాంప్ (23) టాప్ స్కోరర్ కావడం గమనార్హం. పాక్ బౌలర్లలో తారిక్ 4, షాదాబ్ ఖాన్ 3.. సల్మాన్ మీర్జా, నవాజ్ చెరో వికెట్ తీశారు. ఇప్పటికే టీమ్‌ఇండియా సూపర్-8కి దూసుకుపోగా.. పాకిస్థాన్ తన బెర్తును ఖరారు చేసుకుంది. దీంతో యూఎస్ఏ, నెదర్లాండ్స్, నమీబియా టీ20 ప్రపంచ కప్ నుంచి నిష్క్రమించాయి.**



**ఫర్హాన్ సెంచరీతో..**

టాస్ గెలిచిన పాకిస్థాన్ బ్యాటింగ్ ఎంచుకుంది. నమీబియా ఎదుట 200 పరుగులను లక్ష్యంగా నిర్దేశించడంలో ఫర్హాన్ కీలక పాత్ర పోషించాడు. తొలి బంతి నుంచి చివరి వరకూ క్రీజ్‌లో ఉన్న ఫర్హాన్ (100*: 58 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. దీంతో పాకిస్థాన్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. సైమ్ అయూబ్ (14), ఖవాజా నఫాయ్ (5) విఫలం కాగా.. కెప్టెన్ సల్మాన్ అఘా (38), షాదాబ్ ఖాన్ (36*) రాణించారు. నమీబియా బౌలర్లలో జాక్ బ్రాసెల్ 2, ఎరాస్మస్ ఒక వికెట్ తీశారు.